# ప్రజాశక్తి

బుధవారం 6 ఆగష్టు 2025 8 పేజీలు




ప్రకాశం



బాపట్ల



వెట్టిచాకిరీ నుంచి విముక్తి పొందిన వారితో కలెక్టర్ తమీమ్అన్సారియా, ఆర్డీవో లక్ష్మీప్రసన్న

## వెట్టిచాకిరీ నుంచి..

# 40 మందికి విముక్తి

- రిలీఫ్ సర్టిఫికెట్లు అందజేసిన కలెక్టర్
- బాధితులను ప్రత్యేక బస్సులో స్వస్థలాలకు ..: ఆర్డీవో

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

టంగుటూరు మండలంలోని రెండు రొయ్యల పరిశ్రమలలో వెట్టిచాకిరీ చేస్తున్న 40 మంది ఒడిశా, చత్తీస్‌గఢ్ రాష్ట్ర వాసులకు కలెక్టర్ తమీమ్అన్సారియా ఆదేశాలతో ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో అధికారులు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి.. వారికి విముక్తి కల్పించారు. కలెక్టర్ ఏ.తమీమ్అన్సారియా మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో వారికి రిలీఫ్ సర్టిఫికెట్లు అందించారు. పనిచేసిన కాలానికి చట్టప్రకారం వారికి రావాల్సిన నగదును ఇప్పించడంతో పాటు ప్రత్యేక రవాణా సౌకర్యం కల్పించి.. బాధితులను వారి స్వస్థలాలకు చేర్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

**బాధితులను ప్రత్యేక బస్సులో స్వస్థలాలకు..**

ఒడిశా నుంచి 17 మంది, ఛత్తీస్‌ఘడ్ నుంచి 23 మంది వచ్చి టంగుటూరు మండలంలోని రెండు రొయ్యల పరిశ్రమలలో పనిచేస్తున్నట్లు ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న తెలిపారు. తమ జిల్లా ప్రజలు ఇక్కడ వెట్టి చాకిరీ చేస్తున్నారని ▶ 2లో

## స్మార్ట్‌మీటర్లు తొలగించే వరకు

# ఉద్యమం ఆగదు

- కార్పొరేట్లకు దోచిపెట్టే చర్యలు తిప్పికొట్టేందుకు ప్రజల్ని సన్నద్ధం చేయాలి..
- విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా మరో ఉద్యమం తప్పదు
- విద్యుత్ భవన్ వద్ద ధర్నాలో ప్రజాసంఘాల హెచ్చరిక..



విద్యుత్ భవన్ వద్ద ధర్నాలో పాల్గొన్న నాయకులు, ప్రజలు

**ప్రజాశక్తి-ఒంగోలు సిటీ**

ప్రపంచ బ్యాంకు సూచనలతో మోడీ కనుసన్నల్లో.. రాష్ట్ర ప్రభుత్వం అదానీతో చేసుకున్న ఒప్పందం ప్రకారం బాగున్న డిజిటల్ మీటర్లను తొలగించి.. ప్రజల కళ్లుగప్పి బిగిస్తున్న స్మార్ట్ మీటర్లు తొలగించే వరకు ఉద్యమం కొనసాగించాలని పలువురు ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లు బిగించొద్దని, పెంచిన ట్రూ అప్, సర్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గత 10 రోజులుగా నగరంలో ప్రచారం చేపట్టి మంగళవారం నాడు విద్యుత్ భవన్ వద్ద ధర్నా చేపట్టారు. ప్రజాసంఘాల ఐక్యవేదిక సారథ్యంలో ఐఎఫ్‌టియు నాయకులు ఎంఎస్ సాయి, సిఐటియు ఒంగోలు నగర అధ్యక్షులు టి మహేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు జీవీ కొండారెడ్డి, చీకటి శ్రీనివాస రావు, ఎఐఎఫ్‌టియు జిల్లా నాయకులు డివి.స్వామి, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు ఆర్.మోహన్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో విద్యుత్ ఆదాతో పాటు బిల్లు తగ్గుతుందని మభ్యపెట్టి.. ప్రజల సంపదను కార్పొరేట్లు దోచుకునే చర్య అత్యంత దుర్మార్గమని పేర్కొన్నారు. 1998లో విద్యుత్ సంస్కరణలు చేపట్టిన పాలక వర్గాలు ప్రపంచ బ్యాంకు సూచనలకనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి, కొనుగోలు, పంపిణీగా ▶ 2లో

# కొండపి సర్పంచి ఎన్నిక ఏకగ్రీవం

- సర్పంచ్‌గా కొమ్ము సుశీల
- ఉపసర్పంచ్‌గా కూనంనేని వాసంతి



కొమ్ము సుశీల



వాసంతి

**ప్రజాశక్తి-కొండపి**

కొండపి పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ మంగళవారంతో ముగిసింది. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం సర్పంచి పదవికి ఒక్కరే పోటీలో ఉండటంతో అధికారులు సర్పంచి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ▶ 2లో

## ఈదుపల్లిలో ఎవరికీ

# డెంగీ లక్షణాల్లేవు..



గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

- మృతిచెందిన నాగలక్ష్మికి డెంగీ జ్వరం..
- దీర్ఘకాలిక వ్యాధులతోనే సుబ్బారావు మృతి
- కలెక్టర్ జె. వెంకట మురళి

**ప్రజాశక్తి-నగరం**

మండలంలోని ఈదుపల్లి గ్రామంలోని 450 కుటుంబాలను జల్లెడ పట్టి ఫీవర్ సర్వే నిర్వహించగా ఎవరికి డెంగీ లక్షణాలు లేవని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. డెంగీ జ్వరంతో తుమ్మల సుబ్బారావు చనిపోయినట్లు వచ్చిన వార్తల్లో నిజం లేదన్నారు. తుమ్మల సుబ్బారావు క్రానికల్ డయాబెటిస్, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ మరణించినట్లు తెలిపారు. తుమ్మల సుబ్బారావు భార్య మహాలక్ష్మి డెంగీ జ్వరంతో బాధపడుతూ ఆర్.ఎం.పి వద్ద చికిత్స పొందిందని, ఆర్ఎంపీ డాక్టర్ వద్ద వైద్యం పొందడం వల్ల ఆమె ఆరోగ్యం దెబ్బతిన్నదని ఆయన తెలిపారు. జిల్లాలోని నగరం మండలం, ఈదుపల్లిలో జ్వరాలపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా వైద్య పరీక్షలు నిర్వహించారని, ఎవరికీ డెంగీ లక్షణాలు లేవని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈదుపల్లి గ్రామంలో డెంగ్యూ జ్వరంతో ఒక మహిళ మతి కేసు నమోదైనందున కలెక్టర్ మంగళవారం ఈదుపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ▶ 2లో

## స్మార్ట్‌మీటర్లు తొలగించే వరకు ఉద్యమం ఆగదు

(మొదటిపేజీ తరువాయి)

ముక్కలు చేసి కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నట్లు దుయ్యబట్టారు ఇందులో భాగంగా ప్రభుత్వాలు కంపెనీల నుంచి వేల కోట్లు ముడుపులు తీసుకొని రూ.లక్షల కోట్లు దోపిడీ చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు ధ్వజమెత్తారు. యూనిట్ రెండు రూపాయలకు లభించే సౌర విద్యుత్‌ను రూ.10కి కొనుగోలు చేశారన్నారు. ఈ పాటికే అదనపు లోడ్, అదనపు డిపాజిట్, అదనపు ఇందన ఖర్చులు పేరుతో దోపిడీ చేస్తున్న కంపెనీలు స్మార్ట్ మీటర్ ఏర్పాటు కు సింగిల్ ఫేస్‌కు రూ.9 వేలు, త్రీ ఫేస్‌కు రూ.18 వేలు చొప్పున 93 కిస్తీల్లో వసూలు చేస్తారని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే సెకి ఒప్పందం రద్దు చేస్తామని, స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని పిలుపునిచ్చిన లోకేష్ మాట నిలుపుకునే దమ్ముందా.? అని సవాల్ విసిరారు. ప్రజల్ని లూటీ చేసే ఈ స్మార్ట్ మీటర్లు తొలగించే వరకు ఉద్యమం ఆగదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ కె మాబు, కిసాన్ సంయుక్త మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు, అఖిలభారత రైతు కూలి సంఘం రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, రైతుకూలి సంఘం జిల్లా కార్యదర్శి కె లలితకుమారి మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు రైతులకు చేటు తెస్తుందన్నారు. సబ్సిడీలు రద్దవడమే కాకుండా గతంలో మాదిరిగా పెనాల్టీ తో చెల్లించే వెసులుబాటు కోల్పోతారని పేర్కొన్నారు. సంస్కరణల పేరుతో కార్పొరేట్లకు సంపదను దోచిపెట్టే చర్యలను తిప్పి కొట్టేందుకు ప్రజలను సన్నద్ధం చేయాలని పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లు తొలగించే వరకు, విద్యుత్ చార్జీలు తగ్గించే వరకు ఉద్యమం కొనసాగాలని వారు పిలుపు నిచ్చారు. అనంతరం విద్యుత్ భవన్ అధికారులకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సిహెచ్.రాంబాబు, తంబి శ్రీనివాసులు, జి.రమేష్, దామా శ్రీనివాసులు, కె సామ్రాజ్యం, కె శ్రీనివాసరావు, హుస్సేన్, కౌలు రైతు సంఘ నాయకులు వి బాలకోటయ్య, ఐఎఫ్టియు నాయకులు పరిటాల సుబ్బారావు, ఐద్వా నగర కార్యదర్శి జి ఆదిలక్ష్మి, రాజేశ్వరి, ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నాయకులు శేషయ్య, పట్టణ అభివృద్ధి నాయకులు భక్తసింగ్‌రాజు పాల్గొన్నారు.

## కొండపి సర్పంచి ఎన్నిక ఏకగ్రీవం

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించారు. తొలుత సర్పంచి పదవికి మొత్తం 15 మంది నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలనలో ఒకటి తిరస్కరణకు గురైంది. అనంతరం 13 మంది నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో టిడిపి అభ్యర్థి కొమ్ము సుశీల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొత్తం 14 వార్డులకు గానూ 39 మంది నామినేషన్లు వేశారు. పరిశీలనలో రెండు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన 37 మందిలో 23 మంది నామినేషన్లు ఉపసంహరించారు. దీంతో 14 వార్డుల్లో ఒక్కక్కరే పోటీలో ఉండటంతో అందరూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టిడిపి బలపరిచిన 9మంది, వైసిపి బలపరిచిన ఐదుగురు వార్డు మెంబర్లుగా ఎన్నికయ్యారు.

**టిడిపి వార్డు మెంబర్లు వీరే..**

ఒకటో వార్డు ముక్కు ప్రసాదు, 3వ వార్డు నేతి రవికుమార్,4వ వార్డు నల్లమల శివకుమారి, 6వ వార్డు మునగల కష్ణమ్మ, 7వ వార్డు ఎనమదినివెంకటేశ్వర్లు. 8వ వార్డు దేపూరి రోజా, 9వ వార్డు కూనంనేని వాసంతి. 12వ వార్డు తన్నీరు సుబ్బులు. 14వ వార్డు చింతల సుజాత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**వైసిపి వార్డు మెంబర్లు వీరే..**

2వ వార్డు కడియం నరసింహారావు, 5వ వార్డు బాలిశెట్టి సువార్తమ్మ, 10వ వార్డు పల్లె శివరావు, 11 వవార్డు కొమ్ము నాగలక్ష్మి,13వ వార్డు మామిళ్ళపల్లి గోవిందమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**కొమ్ము సుశీల ప్రమాణస్వీకారం**

సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కొమ్ము సుశీల, ఉపసర్పంచిగా కూనంనేని వాసంతి ప్రయాణ స్వీకారం చేశారు. అదేవిధంగా ఏకగ్రీవంగా ఎన్నికైన వార్డు మెంబర్లతో కూడా ప్రమాణ స్వీకారం చేయించారు.

# వెట్టిచాకిరీ నుంచి 40 మందికి విముక్తి

(మొదటిపేజీ తరువాయి)

ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం, బస్తర్ జిల్లా కలెక్టర్ ఇచ్చిన సమాచారం మేరకు స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రభుత్వ అధికారులు బాధితులను సోమవారం రక్షించినట్లు తెలిపారు. ఒక మధ్యవర్తి మాయమాటలు చెప్పి తమను ఈ వెట్టిచాకిరీ ఊబిలోకి దించారని, తమకు సరైన వసతి, ఆహారం, చేసిన పనికి డబ్బులు కూడా ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టారని బాధితులు చెప్పినట్లు ఆర్డీవో వివరించారు. బాధితులలో మైనర్లు కూడా ఉన్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆ పరిశ్రమలపై వెట్టిచాకిరీ నిర్మూలన, బాల కార్మిక నిర్మూలన, కనీస వేతన చట్టాలలో కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. బాధితుల కోసం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసి.. బస్తర్ జిల్లా నుంచి వచ్చిన అధికారులతో వారి స్వస్థలాలకు పంపుతున్నట్లు తెలిపారు. రిలీఫ్ సర్టిఫికెట్లు అందజేసిన కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీవోతో పాటు ఐసిడిఎస్ పీడీ సువర్ణ, కార్మిక శాఖ సహాయ కమిషనర్ (కందుకూరు పరిధి) ఎం.కోటేశ్వరరావు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మేరీ సుజాత, టంగుటూరు తహశీల్దార్ ఆంజనేయులు, డిసిపిఓ దినేష్ కుమార్, సార్డ్స్, శ్యామ్(ఐజెఎం) స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

## ఆటో కార్మికులను ఆదుకోవాలి

**సిఐటియు**

**ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్**

ఆగస్టు 15 నుంచి అమలు కానున్న స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోనున్నారని, కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులను ఆదుకోవాలి స్థానిక సిఐటియు నాయకులు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. గిద్దలూరు పట్టణం నరవ ఆటో స్టాండులో మంగళవారం జి రాజు అధ్యక్షతన గిద్దలూరు పట్టణ ఆటో వర్కర్స్ యూనియన్ సదస్సు జరిగింది. ఈ సదస్సులో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టి ఆవులయ్య పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 15 నుంచి ప్రారంభిస్తున్న స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం ద్వారా నష్టపోతున్న ఆటో కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం వాహన మిత్ర పథకం ద్వారా రూ.15,000 రూపాయలు ఇవ్వాలని, వివిధ రకాలుగా పెంచిన టాక్సులు, ఇన్సూరెన్సులు, ఆటోలకు చేస్తున్న బ్రేక్ ఫైన్లు తగ్గించాలని, డీజిల్ సబ్సిడీతో ప్రతి ఆటో కార్మికుడికి పది లీటర్ల వరకు సబ్సిడీతో డీజిల్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల సమస్యలపై ఈ నెల 12వ తేదీన గిద్దలూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద జరుగనున్న ధర్నాలో ఆటో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి బాల గురవయ్య, ఎస్కే రఫీ, ఎస్ రాజేష్, ఎస్‌కె ఉస్మాన్, కే హుస్సేన్, నరేంద్ర, రమేషు, ఏ బాలపర్దిరాజు, ఎస్‌కె కరీం, రసూల్, దానం మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు బి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

## ఎంఈఓగా మధుసూదన్‌రెడ్డి

**బేస్తవారిపేట:** మండల విద్యాశాఖధికారి–1గా నరెడ్ల మధుసూదన్ రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మాథ్స్ (ఎస్ఏ) టీచర్‌గా పనిచేస్తూ, ఇటీవల పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.















# బస్టాండ్ అభివృద్ధికి కృషి చేస్తా

**ప్రజాశక్తి-పెద్దదోర్నాల**

పెద్దదోర్నాల బస్టాండ్ అభివృద్ధికి కృషి చేస్తానని మార్కాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ నరసింహులు అన్నారు. మంగళవారం ఆయన పెద్దదోర్నాలలోని బస్టాండ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ వివిధ మార్గాల ద్వారా 200 బస్సులు బస్టాండ్‌కు వస్తుంటాయని తెలిపారు. ప్రయాణికులను దృష్టిలో పెట్టుకొని మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ నెల 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలులోకి రానుండడంతో మరిన్ని బస్సులు పెరిగే అవకాశం ఉందన్నారు.

# హాస్టల్ తరలించొద్దని ధర్నా

**ప్రజాశక్తి -కనిగిరి**

కనిగిరి బీసీ-2 హాస్టల్‌ను తరలించవద్దని కోరుతూ విద్యార్థులు ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. తొలుత పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ విద్యార్థులు మాట్లాడుతూ తమ హాస్టల్‌ను వేరే ప్రాంతానికి తరలిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అవసరమైతే ఆర్‌డిఒ కార్యాలయం వద్ద దీక్షలు చేపడతామని తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సిహెచ్.వినోద్ మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ కేంద్రంలో బాగా నడిచే హాస్టల్ తరలించడం బీసీ విద్యార్థుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తెలుపుతుందన్నారు. ఏకపక్ష నిర్ణయాన్ని వెంటనే రద్దు చేసి హాస్టల్‌ను యథావిధిగా కొనసాగించాలనీ డిమాండ్ చేశారు. కనిగిరి బీసీ-2 బాలుర హాస్టల్లో 100 మంది విద్యార్థులు చదువుతున్నారు. కనిగిరి రెవెన్యూ డివిజన్ కేంద్రం, విద్యాకేంద్రమైన ఇక్కడ హాస్టల్ అవసరం ఎక్కువగా ఉందన్నారు. అయినప్పటికీ ఎవరిని సంప్రదించకుండా, అభిప్రాయాలు సేకరించడకుండా ఏకపక్ష నిర్ణయంతో హాస్టల్‌ను వెలిగండ్ల మండలంలోని ఇమ్మడి చెరువు గ్రామానికి తరలిస్తున్నట్లు నిర్ణయం చేయడం దారుణమన్నారు.వెలిగండ్ల మండలంలో ఈ పాటికే ఎస్సీ, బీసీ హాస్టల్స్ఉన్నట్లు తెలిపారు. అదనంగా మరో హాస్టల్ కోసం హాస్టల్ తరలింపు నిర్ణయం చేయడం సరి కాదన్నారు.విద్యా కేంద్రమైన కనిగిరిలో కాకుండా ఇమ్మడి చెరువు గ్రామానికి హాస్టల్ తరలించడం సబబు కాదన్నారు. నిజంగా ఇమ్మడిచెరువు గ్రామంలో హాస్టల్ అవసరమని భావిస్తే కనిగిరి నియోజకవర్గంలో పదిమంది లోపు విద్యార్థులు ఉన్న హాస్టల్స్ ఉన్నాయని, గత నాలుగు సంవత్సరాల నుంచి జిల్లాలో పూర్తిగా మూతబడిన హాస్టల్స్ ఉన్నాయని వాటిని సర్దుబాటు చేసుకోవాలన్నారు.ఆ ప్రయత్నం చేయకుండా బాగా నడిచే హాస్టల్‌ను బదిలీ చేయడం వెనక ఉన్న ఆంతర్యం ఏమిటో, ఏప్రాతిపదికన ఇలాంటి నిర్ణయం చేశారో, జిల్లా అధికారులు సమాధానం చెప్పాలన్నారు. కనిగిరి ఎమ్మెల్యే, జిల్లా అధికారులు ఈ విషయంపై సమగ్రంగా చర్చించి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకొని, పేద విద్యార్థులకు ఉపయోగపడేలా నిర్ణయాన్ని చేయాలని డిమాండ్ చేశారు. హాస్టల్ తరలింపు చర్యను ఉపసంహరించుకోవాలన్నారు. లేకుంటే ఈ సమస్యపై పెద్ద ఎత్తున పోరాటాలకు పిలుపు నిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాండు, నెహమత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

# తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం

**ప్రజాశక్తి -కనిగిరి**

కనిగిరి సెక్టార్ పరిధిలోని కనిగిరి ఎన్‌జిఒలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుమతి మాట్లాడుతూ తల్లి పాలు బిడ్డకు దేవుడిచ్చిన వరమని పేర్కొన్నారు.బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల తల్లి బ్రెస్ట్ కేన్సర్ లాంటి ప్రమాదకరమైన వ్యాధికి దూరంగా ఉండవచ్చునని తెలిపారు.. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు సుజాత, బెల్లంకొండ గోవిందు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

**పొన్నలూరు :** స్థానిక ఎస్‌సి కాలనీలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తూ సిడిపిఒ బి. సుశీల అధ్యక్షతన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ డబ్బా పాలు వద్దు తల్లిపాలే ముద్దని తెలిపారు. పుట్టిన బిడ్డకు మొదట గంటలోనే తల్లిపాలు పట్టించాలన్నారు. మొదటి ఆరు నెలలు తల్లిపాలు బిడ్డుకు శ్రేష్టమన్నారు. నవజాత శిశువులకు తల్లిపాలే శ్రేష్ఠం అని తెలిపారు ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విక్టోరియా, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వై.సత్యవతి, గౌస్యబేగం, మధురవాణి, రమాదేవి, పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

**పామూరు :** తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కారమని అంగన్‌వాడీ సూపర్ వైజర్ పార్వతి తెలిపారు. మండల పరిధిలోని రావిగుంటపల్లి మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ పార్వతి మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు అరగంటలోపే తల్లి ముర్రుపాలు తాగించాలన్నారు. అవి అమతంతో సమానమని తెలిపారు. బిడ్డకు ఆరు నెలలు నిండే వరకూ తల్లిపాలు ఇవ్వాలన్నారు. అనంతరం తల్లిపాల ఆవశ్యకతను తెలియజేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎన్ఎం నాగలక్ష్మి ,సెక్రటరీ బేబీ, వెటర్నరీ అసిస్టెంట్ కరిష్మా ,ఆశా వర్కర్ కళావతి, అంగన్‌వాడీలు మంజుల, అన్నపూర్ణ, జయలక్ష్మి, సుహాసిని, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

**దర్శి :** తల్లిపాల వారోత్సవాలలో భాగంగా దర్శి నగర పంచాయతీ పరిధిలోని శివరాజ్‌నగర్‌లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య కార్యకర్తలకు, నర్సులకు స్థానిక ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ బాదం లక్ష్మీప్రసన్న, చిన్నపిల్లల వైద్యుడు బి. సాయికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మానవత స్వచ్ఛంద సేవాసంస్థ డైరెక్టర్ కపురం శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాదం లక్ష్మీప్రసన్న, డాక్టర్ బి.సాయి మణిధర్‌రెడ్డి మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అనంతరం డాక్టర్లను మానవత సంస్థ ప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ చైర్మన్ దేవతి వరప్రసాదు, సంస్థ నూతన అధ్యక్షుడు చీదెళ్ళ బసవయ్య, సంస్థ సలహా దారుడు సుబ్బారావు, హెచ్‌వి. సుహాసని, సుశీలమ్మ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా దర్శి నగర పంచాయతీ పరిధిలోని పాత క్రిస్టియన్ కాలనీ అంగన్‌వాడీ-2 కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిడిఒ పరిమళ ప్రథం మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లి ముర్రుపాలు తాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ కోఆర్డినేటర్ వెంకటరావు, సూపర్‌వైజర్ సుభాషిని, గర్భిణులు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

**సిఎస్‌పురం :** తల్లిపాలతో బిడ్డకు శ్రేయస్కరమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ దేవకపావరం తెలిపారు. మండల పరిధిలోని మిట్టపాలెంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు భాగ్యమ్మ, నారాయణమ్మ, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



పొన్నలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు



సిఎస్‌పురంలో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు



దర్శిలో అంగన్‌వాడీల ర్యాలీ



కనిగిరిలో గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు



ఎమ్మెల్యేకు మొక్క అందజేస్తున్న సిడిపిఒ

## ఎమ్మెల్యేను కలిసిన సిడిపిఒ

**ప్రజాశక్తి-వెలిగండ్ల**

వెలిగొండ సిడిపిఒగా షేక్ ఆషాబేగం బాధ్యతలు స్వీకరించారు. అందులో భాగంగా కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డిని మంగళవారం మర్యాద పూర్వకంగా కలసి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ ఉండాలన్నారు. గర్భిణులు ,బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం క్రమముగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్ గంధం సామ్యూల్ గెర్షోం, డేటా ఎంట్రీ ఆపరేటర్ రసూల్, అంగన్‌వాడీలు కార్యకర్త ఎం. వరలక్ష్మి అటెండర్ శాంతి పాల్గొన్నారు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సహోధ్యాయులు

## ఉపాధ్యాయులకు సన్మానం

**ప్రజాశక్తి-దర్శి :** దర్శి నగర పంచాయతీ పరిధిలోని శివరాజ్ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను మంగళవారం సన్మానించారు. ఏరువ శ్రీనివాసరావు, వేమా రమణయ్య, ఆర్.మోహన్, ప్రియంవద, సామ్రాజ్యంను ప్రధానోపా ధ్యాయుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రంలో ఉపాధ్యాయులు ఖాదర్‌వలి, రామారావు, ఆదిలక్ష్మీ, బీబీజాన్, సుజాత, రోశయ్య, సంధ్యారాణి పాల్గొన్నారు.

## 7న షూటింగ్ బాల్ జట్ల ఎంపిక

**ప్రజాశక్తి-టంగుటూరు :** ప్రకాశం జిల్లా షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాల, బాలికల జట్ల ఎంపికలు ఈనెల 7న నిర్వహిస్తున్నట్లువ్యాయామ ఉపాధ్యాయుడు అశోక్‌బాబు తెలిపారు. టంగుటూరు మండలం జమ్మలపాలెం జడ్‌పిహెచ్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అశోక్‌బాబు తెలిపారు. ఎంపికలకు హాజర్యయే బాల, బాలికలు 01.06.2006 తరువాత జన్మించి 19 సంవత్సరాల కలిగి ఉండాలన్నారు. ఎంపికలకు హాజరయ్యే విద్యార్థులు జమ్మలపాలెం జడ్‌పిహెచ్ పీడీ అశోక్ బాబును సంప్రదించాలని కార్యదర్శి కె. వెంకటేష్ తెలిపారు. పూర్తి వివరాలకు 8919591417 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

## బైకును ఢీకొన్న కారు
## అన్నదమ్ములకు గాయాలు

**ప్రజాశక్తి-నాగులుప్పలపాడు :** బైకును కారు ఢీకొన్న ఘటనలో అన్నదమ్ములకు తీవ్ర గాయాల య్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని నిడమానూరు గ్రామ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో నిడమానూరులోని ముస్లిం కాలనీకి చెందిన అన్నదమ్ములు సయ్యద్ చిన్న మదార్ , సయ్యద్ ఖాదర్ వలీ రోజులాగే ఒంగోలు వెళ్లి కార్పెంటర్ పని చేసుకొని బైకుపై ఇంటికి వస్తున్నారు. ఘటనా స్థలం వద్ద వచ్చే సరికి ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. వారికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఒంగోలు కిమ్స్ హస్పటల్ కు తరలించారు.

# స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ప్రజలు ప్రతిఘటించాలి


యుటిఎఫ్ సభ్యత్వ నమోదు ప్రారంభిస్తున్న బాపయ్య

## యుటిఎఫ్ సభ్యత్వ నమోదు ప్రారంభం

**ప్రజాశక్తి - నిజాంపట్నం**


ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యుటిఎఫ్ ముందంజలో ఉంటుందని యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సిహెచ్ బాపయ్య అన్నారు. మండలంలో రెండు రోజులుగా యుటిఎఫ్ సభ్యత్వ నమోదు ప్రారంభమైనట్లు తెలిపారు. ఉపాధ్యాయులు యుటిఎఫ్ సభ్యత్వం నమోదు చేసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులకు ఆన్లైన్ వర్క్ తగ్గించాలని, యాప్‌లతో ఉపాధ్యాయుల బోధన సమయం కుంటుపడుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పిఆర్సి కమిటీ నియమించాలని, డిఎ, ఐఆర్‌ను ప్రకటించాలని కోరారు. 10వ తరగతి పరీక్షల్లో గతేడాది మండల స్థాయిలో అత్యున్నత ప్రతిభ చూపిన జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్ఎం పి శివన్నారాయణను, ఇటీవల పదోన్నతి పొందిన పెద్దూరు జెడ్‌పి హై స్కూలు హెచ్ఎం సుశీల, బదిలీపై అడవులదీవి జెడ్‌పి హై స్కూలు హెచ్ఎం బాధ్యతలు స్వీకరించిన నల్లపాటి వెంకట సాంబశివరావును దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు వై శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎండి హుస్సేన్, గౌరవాధ్యక్షులు సిహెచ్ గణేష్‌రావు, ఉపాధ్యక్షులు ఓ నాగరాజు, కోశాధికారి యు కుమార్, జిల్లా కౌన్సిలర్స్ డి హరిబాబు, పి ఏడుకొండలరావు, రాజ, భూషణం, రామకృష్ణ, నాగబాబు పాల్గొన్నారు.


ప్రచార నిర్వహిస్తున్న చేనేత నాయకులు

## 7న చేనేత కార్మికుల నిరసన

**ప్రజాశక్తి - భట్టిప్రోలు**

గతేడాది జాతీయ చేనేత దినోత్సవ సదస్సులో సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఎపి చేనేత కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. చేనేతలకు ఇచ్చిన హామీలు అమలు కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. దీక్షలకు కార్మికులు హాజరు కావాలని కోరుతూ మండలంలో ప్రచారం నిర్వహించారు. దీక్షలు సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య ప్రారంభిస్తారని తెలిపారు. అనుబంధ చేనేత కార్మిక సంఘాల నాయకులు గొట్టుముక్కల బాలాజీ, మర్రివాడ వెంకట్రావు హాజరవుతారని తెలిపారు.


రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ కొండయ్య

## సిసి రోడ్డుకు శంకుస్థాపన

**ప్రజాశక్తి - చీరాల**

రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం దృష్టి పెట్టి అభివృద్ధి చేస్తుందని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. బుర్లవారిపాలెంలో రూ.1 కోటితో నిర్మించనున్న రహదారి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు బుర్ల రాంబాబు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

**ప్రజాశక్తి - బాపట్ల**

స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే ప్రజలు తిరగబడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లు బిగించవద్దు, ట్రూ అప్, సర్దుబాటు ఛార్జీలు పెంచవద్దని స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద వామపక్ష పార్టీలు ధర్నా నిర్వహించారు. ప్రజావేదికగా వామపక్ష పార్టీలు, వివిధ ప్రజా సంఘాలు నిర్వహించిన ధర్నాకు కె శరత్ అధ్యక్షత వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి సింగరకొండ, సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్ మాట్లాడారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్షులు వై భాస్కరరావు, సిపిఎం నాయకులు కె నాగేశ్వరరావు, ఐద్వ నాయకులు టి సుభాషిణి, సిపిఐ పట్టణ నాయకులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.


కొల్లూరులో ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

**కొల్లూరు :** మండలంలోని కిస్కిందపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లు వద్దని, ట్రూప్ ఛార్జీలు రద్దు చేయాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యుత్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వేములపల్లి వెంకట రామయ్య, బిఎల్‌కె ప్రసాద్, కౌలు రైతు నాయకులు టి సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి బొనిగల సుబ్బారావు, బొప్పన సాంబశివరావు, కోటేశ్వరరావు, ప్రకాష్ పాల్గొన్నారు.


రేపల్లెలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు మణిలాల్

**రేపల్లె :** గత వైసిపి, ప్రస్తుత టిడిపి ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను దోపిడీ చేస్తే మరో బషీర్బాగ్ వంటి విద్యుత్ ఉద్యమం చూడాల్సి వస్తుందని వామపక్ష పార్టీల నేతలు సిపిఐ ఎంఎల్ నాయకులు, రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు ఎం శోభారాణి, సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ హెచ్చరించారు. పట్టణంలోని ఇసుకపల్లి విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. విద్యుత్ ఎడి డి శ్యాం సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆదర్శ వేదిక పట్టణ కన్వీనర్ వై కిషోర్, రైతు కూలీ సంఘం నాయకులు సుబ్బారావు, జెవివి నాయకులు కె సాయి ప్రసాద్, ఐద్వా నాయకులు వి ధనమ్మ, కె నాంచారమ్మ, డివైఎఫ్ఐ అధ్యక్షులు సిహెచ్ ప్రకాష్, ప్రజా సంఘాల నాయకులు కె రమేష్, బి అగస్టీన్, ఎం ఈశ్వరరావు, సీతారామయ్య, వెంకట్రావు పాల్గొన్నారు.

**చీరాల :** స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజల సొమ్ము దోపిడీ చేస్తూ కార్పొరేట్ కంపెనీలకు కూటమి ప్రభుత్వం కట్టబెడుతూ ప్రజలను మోసం చేస్తుందని సిపిఎం


చీరాల ఎడిఈకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు


భట్టిప్రోలులో ధర్నా చేస్తున్న నాయకులు

డివిజన్ కార్యదర్శి ఎన్ బాబురావు అన్నారు. స్మార్ట్ మీటర్లు, ట్రూ ఆఫ్ చార్జీలు, సేకి ఒప్పందాలు రద్దు చేయాలని కోరుతూ డిఈ కార్యాలయం వద్ద నిరసన ధర్నా నిర్వహించారు. అనంతరం ఎలక్ట్రికల్ ఎడిఈ శ్రీనివాస్‌కు స్మార్ట్ మీటర్ల సమస్యలు వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కొత్తపేట మాజీ సర్పంచ్ ఊటుకూరు వెంకటేస్వర్లు, సిఐటియు కార్యదర్శి ఎం వసంతరావు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి బత్తుల సామెల్, డివైఎఫ్ఐ నాయకులు వి భగవాన్ దాస్, పి కిరణ్, బలహీన వర్గాల సమైక్య నాయకులు గోసాల ఆశీర్వాదం, చేనేత జన సమైక్య నాయకులు మాచర్ల మోహనరావు, ఎరుకుల కుల పోరాట సంఘం నాయకులు మోహన్ కుమార్ ధర్మ, కొత్తపేట మాజీ సర్పంచ్ చుండూరి వాసు, దేవర వెంకటేశ్వర్లు, శేషయ్య, పైడయ్య, ప్రకాష్, బి ఎస్పీ నాయకులు మార్క్, జిలాని పాల్గొన్నారు.



పర్చూరులో మాట్లాడుతున్న ఐక్యవేదిక నాయకులు

**పర్చూరు :** స్మార్ట్ మీటర్ల రద్దు చేయాలని, ప్రజలపై విద్యుత్ భారాలు తగ్గించాలని సిపిఎం జిల్లా నాయకులు పి కొండయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండి శంకరయ్య డిమాండ్ చేశారు. స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యుత్ ఏఈ రమేష్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. సిపిఎం నాయకులు ఎం డేవిడ్, బి చినదాసు, మక్కెన వెంకన్న, జకరయ్య, చిమట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం నాయకులు ఎన్ రంగారావు

**పంగులూరు :** విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రభుత్వం ప్రజలను నిలువు దోపిడీ చేస్తుందని సిపిఎం నాయకులు నాగ బోయిన రంగారావు అన్నారు. విద్యుత్ ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను బిగించవద్దని కోరుతూ ప్రజా ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, సిపిఎం నాయకులు రాయని వినోద్ బాబు, గుడిపాటి మల్లారెడ్డి, సరికొండ రామచంద్రరాజు, పూసపాటి సుబ్బరాజు, చక్రవరం వెంకటేశ్వరరాజు, ఆదుమ్ సాహెబ్, తలపనేని సుబ్బారావు, కయ్యాల ఇశ్రాయేలు, తానికొండ సుధాకర్, వెంకటేశ్వర్లు, ఇమ్మానుయేలు, జాన్ సాహెబ్ పాల్గొన్నారు.

**కారంచేడు :** ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు, ఇంధన సద్దుబాటు చార్జీలు రద్దు చేయాలని కోరుతూ ప్రజా వేదిక, కౌలు రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. గత ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లను పగలగొట్టమని చెప్పిన



కారంచేడులో మాట్లాడుతున్న పి కొండయ్య


మెదరమెట్లలో ధర్నా చేస్తున్న నాయకులు

నాయకులు అధికారానికి వచ్చిన తర్వాత అవే మీటర్లు బిగిస్తున్నారని, ఇది ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు పి శ్రీనివాసరావు, ఆవుల మంద వెంకటేశ్వరరావు, అంకమ్మరావు, హరినాధరావు, సుధీర్, రాజేష్ పాల్గొన్నారు.

**భటప్రోలు :** స్మార్ట్ మీటర్లను బిగించాలనే ఆలోచన మానుకోవాలని వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు కోరారు. స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్, సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని కోరుతూ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. చేనేత కార్మిక సంఘం (ఎఐటియుసి) రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, చేనేత కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ, మర్రివాడ వెంకట్రావు మాట్లాడారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కె రామస్వామి, జి నాగరాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు మనోజ్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు బండారు శ్రీనివాసరావు, విష్ణుమొలకల శ్రీనివాసరావు, కె వీర మోహనరావు, షేక్ నాగూర్ మీరా, వీర ప్రసాద్, సిఐటియు నాయకులు జి సుధాకర్, జి దానియేలు, యప్రాయం పాల్గొన్నారు.

**మేదరమెట్ల :** స్మార్ట్ మీటర్లు వద్దని, పాత మీటర్లనే కొనసాగించాలని, ట్రూ ఆఫ్ చార్జీల రద్దు చేయాలని ప్రజావేదిక ఆధ్వర్యంలో రావినూతలలో పంచాయతీ అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా బాధ్యులు ఎం ఆంజనేయులు, వై రవీంద్రబాబు, బొంతు దశరథ, దాట్ల మాణిక్యరావు, కొల్లా సుబ్బారావు పాల్గొన్నారు.


మార్టూరులో ధర్నా చేస్తున్న ఐక్యవేదిక నాయకులు

**మార్టూరు రూరల్ :** అదానీ స్మార్ట్ మీటర్లు వద్దు, పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు బత్తుల హనుమంతరావు, కందిమళ్ళ రామ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మార్టూరు, కొణిదెన రోడ్డులోని విద్యుత్ డిఈ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణమూర్తి, పాలెపు సాంబశివరావు, ఎన్ సాంబశివరావు, మోహనరావు, బోడెంపూడి సూరిబాబు, ఎనికపాటి రాంబాబు, పి నాగేశ్వరావు పాల్గొన్నారు.

**అద్దంకి :** సిఎం చంద్రబాబుకు విద్యుత్ గండం పొంచి ఉందని మాజీ శాసన మండలి సభ్యులు జల్లి విల్సన్ అన్నారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా స్థానిక బస్టాండు సెంటర్లో నిరసన తెలిపారు. సిఐటియు నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విల్సన్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు కెఎల్‌డి ప్రసాద్, ఖాదర్ బాషా, సిఐటియు నాయకులు తిరుపతిరెడ్డి, పట్టణ పౌర సంఘ నాయకులు బి విజయ్ కుమార్, కరీం, ఆదాము, నాగేశ్వరావు, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, సామియేల్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌సి జల్లి విల్సన్

'ఉపాధి భద్రత' కల్పించాలని

# మున్సిపల్ కార్మికుల నిరసన


నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

**ప్రజాశక్తి-ఒంగోలు సిటీ**

ఉపాధి భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు నిరసన చేపట్టారు. ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న కార్మికులు మంగళవారం ఉదయం ప ఏపీ మున్సిపల్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఎపిఎమ్ఇఎఫ్) ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో మస్టర్ పాయింట్ల వద్ద కార్మికులు ధర్నా నిర్వహిస్తూ తమ సమస్యలను ప్రభుత్వానికి, అధికారులకు తెలియజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ మరణించిన కార్మికుల కుటుంబాలకు ఉపాధి కల్పించాలని, 60 ఏళ్లు నిండిన వారిని జీవో నెంబర్ 25 ప్రకారం పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నగర కార్యదర్శి టి.మహేష్ మాట్లాడుతూ పర్యవేక్షణ పేరుతో మున్సిపల్ అధికారులు కార్మికులపై ఒత్తిడి పెడుతున్నారని ఆరోపించారు. కార్మికులపై 'మీ పని సరిగా లేదు' అనే వాదనతో అధికారులు చర్యలు తీసుకుంటామని బెదిరిస్తున్నారని యూనియన్ నేతలు ఆరోపించారు. ఈ దుర్నీతిని తక్షణం ఆపాలని, కార్మికుల హక్కులను పరిరక్షించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జి నరసింహ, టి విజయమ్మ, యు రత్నకుమారి, మోహన్, రాములు, ఎద్దు రవి, ఎంబాబు, ఆర్ శ్రీనివాసరావు, పి సుబ్బారావు, ఆనంద్, కే వెంకటేశ్వర్లు, ఎం లక్ష్మీకాంతం, నాగలక్ష్మి, కే.వంశీ, ప్రవీణ్ పాల్గొన్నారు.

# ఆగి..సాగిన పొగాకు వేలం

- లోగ్రేడ్ పొగాకు కొనుగోలు విషయంలో రైతుల ఆందోళన..
- ఆర్ఎం, రైతు సంఘం జోక్యంతో తిరిగి ప్రారంభమైన కొనుగోళ్లు


పొగాకు బోర్డు ఆర్ఎంతో మాట్లాడుతున్న రైతు సంఘం నేతలు

**ప్రజాశక్తి-ఒంగోలు సిటీ**

లోగ్రేడ్ పొగాకు కొనుగోలుపై రైతుల ఆందోళన చేపట్టిన ఘటన ఒంగోలు ఒకటో పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. చీమకుర్తి మండలానికి చెందిన కె.వి.పాలెం, గోనుగుంట, జి.ఎల్.పురం, మంచికలపాడు, టీ.గుడిపాడు, బండమూడి గ్రామాలకు చెందిన పొగాకు రైతులు వేలానికి తెచ్చిన దాదాపు వెయ్యికి పైగా బేళ్లలో లోగ్రేడ్ పొగాకు కొనుగోలు జరగకపోవడంతో, రైతులు వేలం ప్రక్రియను అడ్డుకున్నారు. తాత్కాలికంగా నిలిపివేశారు. ఇప్పటికే నాలుగు సార్లు పంట తిరిగి తీసుకెళ్లాల్సి వచ్చింది. మళ్లీ అదే పరిస్థితి అయితే ఎలా.? అంటూ రైతులు అధికారులను నిలదీశారు. వేలం నిర్వహణ అధికారి వెంటనే పరిస్థితిని పొగాకు బోర్డు ప్రాంతీయాధికారి (ఆర్.ఎం)కు సమాచారం అందించడంతో ఆయన వేలం కేంద్రం వద్దకు చేరుకున్నారు. వేలం ప్రక్రియ గురించి సమాచారం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జయంతి బాబు, కార్యదర్శి పమిడి వెంకటరావు వేలం కేంద్రానికి చేరుకొని ఆర్.ఎం. శీలం రామారావుతో చర్చలు జరిపారు. వాతావరణం కారణంగా పంట తక్కువ నాణ్యత ఉన్నా.. ఇది కూడా కష్టంతో పండించిన పంటగా పేర్కొన్నారు. రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారని, వెంటనే లోగ్రేడ్ పొగాకును పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్ఎం రామారావు స్పందించి వ్యాపారసంస్థల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమై, కొనుగోలు ప్రక్రియను తిరిగి ప్రారంభించారు. కొంతవరకు కొనుగోలు జరిగినా, పెద్ద మొత్తంలో లో గ్రేడ్ బేళ్లు తిరిగి రైతుల చేతుల్లోకి చేరాయి.

బ్రైట్ గ్రేడ్ పొగాకు కొనుగోలు కొనసాగుతుండగా, లో గ్రేడ్‌ను వ్యాపారులు తిరస్కరిస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని జయంతిబాబు, వెంకటరావు పేర్కొన్నారు. ఈ పరిస్థితిని పరిష్కరించేందుకు ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని, ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా కొనుగోలు జరపాలని, దీనికి సత్వరం రూ.వెయ్యి కోట్లు నిధులు కేటాయించాలని రైతుసంఘం నేతలు డిమాండ్ చేశారు. లోగ్రేడ్ పొగాకు కనీసం రూ.20 వేల ధరకు తగ్గకుండా కొనుగోలు చేయాలని, దీనికోసం రైతులు ఐక్యంగా పోరాడాలని జయంతిబాబు, వెంకటరావు పిలుపునిచ్చారు. రైతాంగం చైతన్యంతో కూడిన ఒత్తిడిని ప్రభుత్వంపై తీసుకురావాలని సూచించారు.

## ఆర్ఐఒగా ఆంజనేయులు బాధ్యతల స్వీకారం


ఆర్ఐఒ ఆంజనేయులును అభినందిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి-ఒంగోలు సిటీ**

ఇంటర్మీడియట్ బోర్డు ప్రకాశం జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణ అధికారిగా (ఆర్.ఐ.ఓ) తాళ్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.ఆంజనేయులు మంగళవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆర్ఐఓగా పనిచేసిన ఎ.సైమన్ విక్టర్ ఇంటర్ బోర్డు పరీక్షల నియంత్రణ అధికారిగా నియమితులవ్వడంతో ఆర్ఐఓ బాధ్యతలు ఆంజనేయులుకు అప్పగిస్తూ ఇంటర్ బోర్డు కార్యదర్శి డాక్టర్ కతికాశుక్లా ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

## రాష్ట్ర మహాసభల ప్రచార బస్సుయాత్ర ప్రారంభం

**ప్రజాశక్తి-ఒంగోలు సిటీ**

సిపిఐ 28వ రాష్ట్ర మహాసభల నేపథ్యంలో ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు ఏర్పాటు చేసిన ప్రచార బస్సు యాత్రను పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య ప్రారంభించారు. మంగళవారం నాడు కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏపీ ప్రజానాట్యమండలి కళాకారుల ఆట, పాట, మాట.. ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. మహాసభలు ఈ నెల 20 నుంచి 25 వరకు ఒంగోలు నగరంలో జరగనున్నాయని ఈశ్వరయ్య తెలిపారు.

## ఇంటర్ పరీక్షల నియంత్రణాధికారిగా విక్టర్


సైమన్ విక్టర్

**ప్రజాశక్తి- ఒంగోలు సిటీ**

ఇంటర్ బోర్డు పరీక్షల నియంత్రణాధికారిగా ఎ. సైమన్ విక్టర్ బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఆయనను ఇంటర్ విద్యామండలి డైరెక్టర్ డా.కతికా శుక్లా ఉత్తర్వులతో ఈ పదవికి నియమించారు. మంగళవారం ఆయన అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు.

## నేడు విద్యుత్‌కు అంతరాయం

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

డి3 పరిధిలోని పేర్నమిట్ట, ప్రతిభ కాలేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, అమరావతి నగర్, లింగారెడ్డికుంట, టుబాకో బోర్డు, ద్వారకా నగర్ ప్రాంతాలలో బుధవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలదని ఒంగోలు టౌన్ డిఈఈ కెవి పాండురంగారావు ఒక ప్రకటనలో తెలిపారు.

# శాంతినగర్ 'సెక్రటరీ'కి షోకాజ్

కమిషనర్ వెంకటేశ్వరరావు ఆకస్మిక తనిఖీ


శాంతినగర్‌లో పరిశీలిస్తున్న కమిషనర్

**ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్**

శాంతినగర్ సచివాలయ పరిధిలో నగరపాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు మంగళవారం పర్యటించారు. అక్కడి శానిటేషన్ సిబ్బంది పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సెక్రటరీకి షోకాజ్ నోటీసు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. శాంతి నగర్ సచివాలయంలో కమిషనర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారున. హాజరు రిజిస్టర్‌ని తనిఖీ చేసి, రిజిస్టర్‌లో సంతకం చేయని సిబ్బందికి మెమో ఇవ్వాలని ఆదేశించారు. కమిషనర్ సచివాలయ పరిధిలో జరుగుతున్న పి-4 సర్వే పురోగతిని అడిగి తెలుసుకున్నారు. సచివాలయ పరిధిలో ఇంకనూ దత్తత తీసుకోని బంగారు కుటుంబాలు ఉంటే వారిని కూడా సచివాలయ పరిధిలో గల వ్యాపారస్తులు, ఎన్ఆర్ఐలతో మాట్లాడి దత్తత అయ్యేలా చూడాలని అక్కడి సిబ్బందికి సూచించారు. సచివాలయానికి వచ్చిన ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఇందులో భాగంగా అక్కడి ప్రజలు సచివాలయ పరిధిలో శానిటేషన్ వారి పనితీరు ఏమీ బాగోలేదని, కనీసం కాలువల నుంచి తీసిన చెత్త కుప్పలను తీసుకువెళ్లడం లేదని తెలిపారు. సచివాలయం ముందర ఉన్న కాలువలోలో గడ్డి పెరిగి, కాలువలను శుభ్రపరచకుండా ఉండటం గమనించి శానిటరీ మేస్త్రికి ఛార్జ్ మెమో ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# 'పి-4'లో చురుకైన పాత్ర పోషించండి

కలెక్టర్లకు సిఎం చంద్రబాబు ఆదేశం


వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అన్సారియా, అధికారులు

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయబోతున్న పి-4 పథకంలో అధికారులు, ప్రజాప్రతినిధులు చురుకైన పాత్ర పోషించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచించారు. మంగళవారం అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, శాసనసభ్యులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈ విషయంలో ప్రతి నియోజకవర్గానికి, ఎమ్మెల్యేకి వారాంతపు రేటింగ్ ఇస్తానని తెలిపారు. ఈ పథకం అమలు ద్వారా సమాజంలో వస్తున్న మార్పును ప్రతి మూడు నెలలకు ఒకసారి మదింపు చేయిస్తానని ప్రకటించారు. తాను కూడా 250 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ఈ పథకానికి సంబంధించి ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక హ్యాండ్ బుక్‌ను ముద్రించిందన్నారు. మార్గదర్శకులకు ఉన్న అపోహలను తొలగించేలా సమగ్ర వివరాలను ఇందులో పొందుపరిచినట్లు తెలిపారు. సేవాదక్పథంతో ముందుకు వచ్చేలా మార్గదర్శకులలో ప్రేరణ నింపాలన్నారు. ఈ విషయంలో ఎలాంటి నిర్బంధం లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ నెల 15వ తేదీ నాటికి మార్గదర్శకులను పూర్తిస్థాయిలో గుర్తించి, 19న ఈ పథకాన్ని ప్రారంభిస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు శాసనసభ్యులు తమ నియోజకవర్గాల్లో చేపట్టిన చర్యలను వివరించగా ముఖ్యమంత్రి అభినందించారు. వారు చేసిన సూచనలను ఆయన పరిగణనలోకి తీసుకున్నారు.

### మార్గదర్శకులను త్వరగా గుర్తించండి

అనంతరం అధికారులతో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ప్రత్యేకంగా చర్చించారు. జిల్లాలో మొత్తం 74,911 బంగారు కుటుంబాలను గుర్తించగా, 6350 మార్గదర్శకులను 37389 కుటుంబాలకు అనుసంధానం చేసామన్నారు. మిగతా బంగారు కుటుంబాల కోసం మార్గదర్శకులను త్వరగా గుర్తించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, డిఆర్ఓ బి.చిన ఓబులేసు, జడ్పీ సిఈఒ బి.చిరంజీవి, ఒంగోలు ఆర్డీవో కె. లక్ష్మీ ప్రసన్న, కొండపి నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్ రెడ్డి, సిపిఒ స్వరూపరాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### ఆర్థిక అసమానతలు తగ్గించడానికే 'పి-4'

**బాపట్ల జిల్లా:** సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించడానికే పి-4 విధానాన్ని ప్రవేశపెట్టామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. పి-4 అమలు తీరుపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో అమరావతి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి మంగళవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. నిరుపేదల కుటుంబాలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పారు. కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతతో వ్యవహరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో జిల్లా నుంచి ఇన్‌ఛార్జి సంయుక్త కలెక్టర్, డిఆర్ఓ జి.గంగాధర్‌గౌడ్, సిపిఓ షాలేమ్ రాజు, డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాసరావు, ఆర్‌డిఓ పి.గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి : మంత్రి గొట్టిపాటి

**ప్రజాశక్తి - మేదరమెట్ల**

అర్హులైన లబ్ధిదారులు అందరికీ ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి అందేలా అధికారులు తీసుకోవాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని కొరిసపాడులో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దండు రామకృష్ణారెడ్డి ఉన్నత పాఠశాల్లో 56 మంది విద్యార్థినీ విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేశారు. విద్యార్థినీ విద్యార్థుల హాజరు శాతం పెంచే విధంగా డ్రాప్ అవుట్స్ లేకుండా చూడాలని అన్నారు. విద్యార్థులు అందరికీ సైకిళ్ల పంపిణీ చేసే విధంగా నిర్ణయం తీసుకున్నామని అన్నారు. సింబ క్రాఫ్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్, సిఎస్ఆర్ నిధులతో డిసెంబర్ నాటికి 10వేల మందికి సైకిళ్ల అందజేయాలనే లక్ష్యంతో


సైకిళ్ల పంపిణీ చేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

పనిచేస్తున్నట్లు తెలిపారు. తొలుత రూ.1.66కోట్లతో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, అంబేద్కర్ నగరంలో ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్ ప్లాంట్ ప్రారంభించారు. జగ్జీవన్‌రావు కాలనీలో రూ.31 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డు, డ్రయిన్లను ప్రారంభించారు. 15 మంది దివ్యాంగులకు మోటర్ ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు. నియోజకవర్గంలో 110 మందికి ఇప్పటి వరకు ట్రైసైకిళ్ల పంపిణీ చేసినట్లు తెలిపారు. రూ.50 లక్షలతో ఎస్సీ కాలనీలో సిసి రోడ్లు, సైడు కాలవలు, 150 విద్యుత్ స్తంభాలు, పొలాలకు వెళ్లడానికి ఇబ్బంది లేకుండా డొంక రోడ్డు నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంకట మురళి, ఎంపిపి సాదినేని ప్రసన్నకుమారి, జడ్పిటిసి టి వెంకటరమణ, తహశీల్దారు జివి సుబ్బారెడ్డి, టిడిపి నాయకులు యడం భవాని ప్రసాదరెడ్డి, శంభోతుల సత్యనారాయణ, జాగర్లమూడి జయకృష్ణ, మేదరమెట్ల శ్రీనివాసరావు, చెన్నుపాటి హరిబాబు పాల్గొన్నారు.


చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

## చిత్రలేఖన పోటీలు

**ప్రజాశక్తి - వేటపాలెం**

స్థానిక జెడ్‌పి బాలికోన్నత పాఠశాల ఆవరణలో స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా హెచ్ఎం దేవరకొండ సరోజిని ఆధ్వర్యంలో విద్యార్థులకు జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో లాంగ్ జంప్, షాట్ పుట్, స్కిప్పింగ్, మ్యూజికల్ చైర్స్, చిత్రలేఖన పోటీలు మంగళవారం నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయులు జె దేవబిక్షం, జె శ్రావణి విద్యార్థులకు అథ్లెటిక్స్ పోటీలు, సోషల్, బయాలజీ ఉపాధ్యాయులు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఆగస్టు 15న బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.


పుస్తకాలు అందజేస్తున్న పత్తి సుబ్బారావు

## నోట్ పుస్తకాల పంపిణీ

**ప్రజాశక్తి - వేటపాలెం**

మండలంలోని గిరిజన, బడుగు, బలహీన వర్గ ప్రాంతాలూగా ఉన్న సర్వోదయ కాలనీ, మంకినివారిపాలెం లోని ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పలకలు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు మాట్లాడారు. మండలంలో వెనకబడిన ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసుకుని, ఆ పాఠశాల్లోని విద్యార్థుల విద్యాభివృద్ధికి నోట్ పుస్తకాలు అందచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన సలహాదారులు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ నాగమాంబ, హెచ్ఎం సజ్జా ఓం ప్రకాష్, కోట సువర్ణలత, చుండూరి ఆదిశేషమ్మ, హెడ్ మాస్టర్ పింజల విజయ్ కుమారి, అనురాధ పాల్గొన్నారు.



మండల సమావేశంలో ఎంపిపి పి రజిని

## 'సూర్య ఘర్'ను ఉపయోగించుకోవాలి


**ప్రజాశక్తి - యద్దనపూడి**

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి పి రజిని అధ్యక్షత మంగళవారం నిర్వహించారు. కె రవికుమార్, ఎంపిడిఒ జావేద్ మాట్లాడు తూ గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించేందుకు సహకారం అందించాలని అన్నారు. ఎలక్ట్రిసిటీ ఎఇ తుమాటి రమేష్ బాబు మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్య ఘర్ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 3కెవి ఏర్పాటు చేసుకుంటే రూ.78వేలు సబ్సిడీ వస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కోటి మందిని ఈ పథకం కింద చేర్చాలనే లక్ష్యంగా పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి ఆర్ అండ్ బి అధికారులు హాజరు కాకపోవడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు ఎంపిడిఒ సంబంధిత శాఖల అధికారులకు నోటీసులు పంపుతామని అన్నారు. కార్యక్రమంలో ఎఒ కుమారి, ఎంఈఓ గోపి, హౌసింగ్ ఎఇ రమణ, పశు వైద్యాధికారి శారద, గన్నవరం ఎంపిటిసి సతీష్, ఎబిఎన్ వెంకట్రావు, సుజాత, చిమటవారిపాలెం ఉప సర్పంచ్ రామారావు, పంచాయతీ కార్యదర్శులు శరత్, బాబురావు, శివప్రసాద్, ప్రభాకరరావు, నాయకులు సుధీర్, బసివిరెడ్డి పాల్గొన్నారు.

# మాజీ సర్పంచి 'చిలుకూరి' మృతి

**ప్రజాశక్తి - పంగులూరు**

పంగులూరు మాజీ సర్పంచ్ చిలుకూరు వెంకటేశ్వర్లు (79) మంగళవారం మృతి చెందారు. గత కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఆయనకు ఒంగోలులోని ప్రైవేట్ వైద్యశాల్లో చికిత్స అందిస్తుండగా మృతి చెందారు. మృత దేహాన్ని స్వగ్రామమైన పంగులూరు తీసుకొచ్చారు. ఆయన యువకుడుగా


వెంకటేశ్వర్లు (ఫైల్)

ఉన్న కాలంలో ఉత్సాహంగా, ప్రజా సమస్యల పట్ల అవగాహనతో ఉండేవారని గ్రామస్థులు తెలిపారు. గ్రామంలో యువజన సంఘంలో సభ్యునిగా, తరువాత సిపిఎం అభిమానిగా ప్రజల సమస్యలపై పనిచేశారు. పార్టీ కార్యక్రమాలకు సహాయపడేవారని సిపిఎం నాయకులు నాగబోయిన రంగారావు చెప్పారు. తరువాత వచ్చిన పంచాయతీ ఎన్నికల్లో వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నిక చేయటంలో సిపిఎం కృషి చేసినట్లు తెలిపారు. ఆయన సర్పంచిగా పనిచేసిన కాలంలో గ్రామంలో రోడ్లు, బోర్లు వేసినట్లు తెలిపారు. వివాద రహితుడని, సౌమ్యుడని తెలిపారు. క్రీడల పట్ల ఆసక్తి చూపేవారని తెలిపారు. రాష్ట్ర స్థాయి క్రీడాకారునిగా మంచి పేరు తెచ్చుకున్నారని తెలిపారు. ఆయన మరణం బాధాకరమని, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.


బహుమతులు అందజేస్తున్న అధికారులు

## మహిళలకు ముగ్గుల పోటీలు

**ప్రజాశక్తి - పంగులూరు**

ప్రతి నెల 5న వాట్సప్ గవర్నెన్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించాలన్న ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా గ్రామంలో ఎంపిడిఒ కె సుమంత్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ కార్యాలయం వద్ద దేశభక్తి ప్రతిబింబించే విధంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి టి రమేష్, ఎపిఎం సిహెచ్ కోటేశ్వరరావు, పంగులూరు, రేణంగివరం పంచాయితీల కార్యదర్శులు బి రాంబాబు, ఎల్ సునీత, హెల్త్ ఎడ్యుకేటర్ వై అనురాధ, నాయకులు గుడిపూడి రామారావు పాల్గొన్నారు.

# సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**ప్రజాశక్తి - చీరాల**

ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. మండలంలోని సాల్మన్ సెంటరులో 'సుపరి పాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులతో ఆయన మాట్లాడారు. వివిధ పథకాలు వివరించారు. స్త్రీనిధి ద్వారా నాలుగు గ్రూపులకు రూ.19 లక్షల చెక్కులు పంపిణీ చేశారు. రూ.20 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డు ప్రారంభించారు. చేనేత కార్మికుల సంక్షేమం దృష్టిలో పెట్టుకుని ఆగస్టు 7నుంచి మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సేవలను ఆగస్టు


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

15 నుండి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఎఎంసి చైర్మన్ కౌతరపు జనార్దన్, టిడిపి అధ్యక్షులు గంజి పురుషోత్తం, వడగ రాజా, సిద్ది బుచ్చేశ్వరరావు, గొడుగుల గంగరాజు, ఎంపిడిఒ, ఎఇ, ఎపిఎం మధు పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు వ్యాక్సిన్‌తో సమానం

**ప్రజాశక్తి - యద్దనపూడి**

బిడ్డ పుట్టిన గంటలోపు పట్టించే ముర్రుపాలు బిడ్డకు వ్యాధినిరోధక టీకాలకన్నా ఉత్తమమైనదని డాక్టర్ శ్రీహర్ష చెప్పారు. మండలంలోని జాగర్లమూడి, యద్దనపూడి గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. స్థానిక కమ్యూనిటీ హాలులో ఎంపిపి రజిని అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. తల్లిపాలు బిడ్డలకు అమృతంతో సమానం అన్నారు. సిడిపిఒ సుభద్ర మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భిణీ స్త్రీలు, బాలింతలకు పౌష్టిక ఆహారం అందించాలని చెప్పారు.

**భట్టిప్రోలు :** మండలంలోని ఐలవరంలో తల్లిపాల వారోత్సవాలపై ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సెక్టార్ సూపర్వైజర్ సంపూర్ణ మాట్లాడారు. తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని అన్నారు.

**చుండూరు :** మండలంలోని ఎడ్లపల్లిలో సూపర్వైజర్ జి శకుంతల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎస్‌కె ముంతాజ్ బేగం పాల్గొన్నారు.

**అమృతలూరు :** మండలంలోని మోపర్రులో సూపర్వైజర్ టి విజయలక్ష్మి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి రావర్ల నరేంద్ర, డాక్టర్ ప్రదీప్, వెంకటలక్ష్మి, హెచ్ఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**రేపల్లె :** తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సిడిపిఒ ఎం సుచిత్ర మాట్లాడారు. తల్లి పాలు బిడ్డకు ఎంత అవసరమో తెలిపారు. శ్రీమంతం, అన్నప్రాశన, వెల్ బేబీ షో కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్‌కె నాటిక్, డాక్టర్ ఎస్‌కె షహీన్, ఎన్‌జిఒ ఎన్ శ్రీనివాసరావు, సూపర్వైజర్లు హిమబిందు, టి రాధికా, ఎస్ సునీత, నాగలక్ష్మి, మంజుల, బిపిసి అరుణ పాల్గొన్నారు.

# వాట్సప్ గవర్నెన్స్‌పై అవగాహన


మాట్లాడుతున్న ఎంపిడిఒ ప్రద్యుమ్నకుమార్

**ప్రజాశక్తి - పర్చూరు**

ప్రభుత్వం అమలు చేస్తున్న వాట్స్‌అప్ గవర్నెన్స్ సేవలపై సచివాలయ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపిడిఒ వి ప్రద్యుమ్న కుమార్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని సచివాలయాల పరిధిలో వాట్సప్ గవర్నెన్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మనమిత్ర వాట్సప్ కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం కల్పించే సేవలను ప్రజలకు సులభతరం చేసిందని తెలిపారు. వాట్సప్ ద్వారా 200 రకాల సేవలు పొందవచ్చని చెప్పారు. 95523 00009 అనే ప్రభుత్వ నెంబరుకు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ పంపితే విద్యా, వైద్య, రవాణా, రెవెన్యూ, రక్షణ, ఇతర సేవలు జాప్యం లేకుండా పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ కె సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ఎ మస్తానరావు పాల్గొన్నారు. ఉప్పుటూరులో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడారు.

**సంతమాగులూరు :** 95523 00009 నంబరుకు మెసేజ్ చేసి 200రకాల ప్రభుత్వ సేవలు పొందవచ్చని ఎంపిడిఒ జ్యోతిర్మయి తెలిపారు. మండలంలోని చవిటిపాలెం, మక్కెనవారిపాలెం, సంతమాగులూరు గ్రామాల్లోని విద్యార్థులు, సచివాలయ ఉద్యోగులకు మనమిత్ర వాట్సాప్ గవర్నెన్ అవగాహన కల్పించారు. వివిధ రకాల సర్టిఫికేట్లు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు వి కోటేశ్వరరావు, దినేష్ కుమార్ పాల్గొన్నారు.


చవిటిపాలెంలో వాట్సాప్ అవగాహన ర్యాలీ

# 'అన్నదాత సుఖీభవ' రాని వాళ్లు దరఖాస్తు చేయొచ్చు

**ప్రజాశక్తి - యద్దనపూడి**

మండలంలోని పోలూరు, శ్యామలవారిపాలెం గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ పథకంలో ఆధార్ తప్పుగా లింక్ అవ్వడంతో డబ్బులు జమ కాని వారు, చనిపోయిన రైతుల పేరుతో పొలం ఉండి రిజెక్ట్ చేయబన వారు సంబంధిత విఆర్ఒను కలిసి సరిచేయించుకున్న తరువాత వ్యవసాయ శాఖ సిబ్బంది వద్ద గ్రీవెన్స్ పెట్టుకోవాలని ఎఒ కుమారి తెలిపారు. ప్రత్తి పంటకు భీమా ఈనెల 14లోపు భీమా చేయించుకోవాలని సూచించారు. కౌలు రైతులు సాగుదారు హక్కు పత్రాలు పొందాలని చెప్పారు. కార్యక్రమంలో విఎఎ లక్ష్మీ సౌమ్య, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, శ్రీను, రాజు, సాంబశివరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

**నిజాంపట్నం :** వరిలో చదరపు మీటరుకు 33 కుదుళ్ళు ఉంటే ఆశించిన దిగుబడులు పొందవచ్చని ఎఒ పివి సుబ్బారావు సూచించారు. మండలంలోని ఆముదాలపల్లి, నిజాంపట్నం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. పొలంలో వరి నాట్లు సందర్శించారు. యూరియా, పొటాష్ పై పాటుగా వేయాలని సూచించినారు. అర్హత ఉండి అన్నదాత సుఖీభవ నగదు జమకాని రైతులు సమీప రైతుసేవ కేంద్రాల్లో చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో ఎఇఒ జాన్ బి, విఎఎ నాగమణి, ఎంపిఇఒ నాగరాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యద్దనపూడి ఎఒ కుమారి

**అద్దంకి :** అర్హులు అందరికీ అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందని ఎడిఎ బి ఎప్రాయం తెలిపారు. మండలంలోని ధర్మవరం, శంఖవరప్పాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆధార్ తప్పుగా నమోదైన వారికి తహశీల్దారు కార్యాలయంలో సరి చేసుకుంటే అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందని తెలిపారు. మ్యుటేషన్ చేసుకోవడం, జాయింట్ ల్యాండ్ విడదీసి దానిలోని రైతులకు అన్నదాత సుఖీభవ వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ, ఉద్యాన అధికారిణి దీప్తి, విఎఎలు శేషయ్య, ఖాజాబీ పాల్గొన్నారు.

**ఇంకొల్లు :** ఈ ఏడాది పొగాకు సాగు చేసి రైతులు నష్టపోవద్దని ఎఒ ఎన్ మేరెమ్మ అన్నారు. మండలంలోని దుద్దుకూరు, గంగవరం గ్రామాల్లో పొలం పిలుస్తుంది నిర్వహించారు. పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలు జొన్న, మొక్కజొన్న సాగు చేసుకోవాలని సూచించారు.

**వేమూరు :** వరి పంటకు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని ఎఒ ప్రేమ్‌సాగర్ సూచించారు. మండలంలోని చావలిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

**అమర్తలూరు :** మండలంలోని అమర్తలూరు, పాంచాలవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఎఒ ఎం హేమంత్ భారత్ కుమార్ రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో అమర్తలూరు పిఎసిఎస్ అధ్యక్షులు కొత్తపల్లి రవీంద్ర బాబు, ప్రకృతి వ్యవసాయం ఇంచార్జి పి సువర్ణరావు, ఎఇఒ డి మాధవి, విఎఎ బి మోనిక, ఎ వాణి, పి వెంకట సాయి మణికంఠ పాల్గొన్నారు.

**భట్టిప్రోలు :** మండలంలోని పల్లెకోనలో ఎఒ బి బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది నిర్వహించారు. కార్యక్రమంలో ఎఇఒ లక్ష్మీ ప్రసన్న, వి బుష్, టి అఖిల్, విఎఎలు రత్నరాజు, యుగంధర్, నాయకులు రాయల ప్రసాదరావు, రామ కోటేశ్వరరావు, ఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.



లోగో ఆవిష్కరిస్తున్న దృశ్యం

## క్రికెట్ లీగ్ జెర్సీ లోగో ఆవిష్కరణ

**ప్రజాశక్తి - వేటపాలెం**

క్యాపిటల్ అమరావతి రాయల్స్ జట్టు ఫ్రాంచైజీ యాజమాన్యం స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కాలేజీలో క్రికెట్ జట్టు జెర్సీ, లోగోలను కాలేజీ వ్యవస్థాపక చైర్మన్ వనమా వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆగస్టు 8 నుండి విశాఖపట్నంలో జరిగే ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో ఏడు జట్లు పాల్గొంటాయని అన్నారు. అనంతరం జట్టు కెప్టెన్ హనుమ విహారి విద్యార్థులతో సంభాషించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు తెలిపారు. కార్యక్రమంలో జట్టు కోచ్ అబ్రహం, టీ మేనేజర్ హర్ష, సీఈఒ యశ్వంత్, బి శ్రీనివాసరావు, కళాశాల సెక్రటరీ వనమ రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, మేనేజర్ ఆర్‌వి రమణ మూర్తి, ప్రిన్సిపల్ కె జగదీష్ బాబు, డైరెక్టర్ డాక్టర్ సి సుబ్బారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంసి చైర్మన్ గుంజి వెంకటరావు

## రైతుల అభ్యున్నతే ఏలూరి లక్ష్యం

**ప్రజాశక్తి - పర్చూరు**

అన్నదాతల అభ్యున్నతే లక్ష్యంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషి చేస్తున్నారని, పొగాకు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వాన్ని ఒప్పించి మార్క్‌ఫెడ్ ద్వారా బర్లీ కొనుగోలు చేయిస్తున్నట్లు ఎంసి చైర్మన్ గుంజి వెంకటరావు అన్నారు. స్థానిక యార్డులో యద్దనపూడికి చెందిన రైతుల బర్లీ పొగాకు కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. దేశ చరిత్రలో ఎన్నడూ ఎక్కడా లేని సంచలన నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకుందన్నారు. రైతులు సంయమనం పాటించి ఉత్పత్తులను విక్రయించాలని కోరారు. కార్యక్రమంలో తెలుగుదేశం యద్దనపూడి మండలం అధ్యక్షులు రంగయ్య చౌదరి, సీతయ్య, తారక రామారావు, సుధీర్, వాసు, రాము, చంద్రశేఖర్, నాగబాబు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ ఢీకొని మహిళకు గాయాలు

**ప్రజాశక్తి - నగరం**

స్థానిక సెంటర్లో ఎపి 27టి 7895 నెంబర్ గల ట్రాక్టర్‌ను డ్రైవర్ అతివేగంగా నడుపుతూ నడుచుకుంటూ వెళుతున్న తాటివాక జయప్రద (45) ను ఢీ కొని ఈడ్చుకుంటూ వెళ్లి పక్కనే ఉన్న బజ్జీల బండిని ఢీ కొట్టింది. అక్కడి నుండి ఎదురుగా ఉన్న గోడకు తగిలి ఆగినది. ఘటనలో టిఫిన్ షాప్ యజమాని గాయపడగా తాటివాక జయప్రద తీవ్ర గాయాలతో స్థానిక పీహెచ్సీ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తాడేపల్లి మణిపాల్ హాస్పిటల్‌కు తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చెసి దర్యాయాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి భార్గవ్ తెలిపారు.

## బైకు ఢీ కొని ఇద్దరికి గాయాలు

**ప్రజాశక్తి - అద్దంకి**

రిక్షా సోడా బండిని ద్విచక్ర వాహన దారుడు ఢీకొట్టిన ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా మరొకరు స్వల్పంగా గాయ పడ్డ ఘటన శంకరాపురం రోడ్డులోని ఇటుకల బట్టిల సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. ముండ్లమూరు మండలం శంకరాపురంకు చెందిన రావూరి వెంకటేశ్వర్లు స్థానికంగా సోడా బండిని రోడ్డు మార్జిన్‌లో ఉంచి వ్యాపారం చేసుకుంటున్నాడు. బత్తులవారంపాలెంకు చెందిన బత్తుల నాగేంద్రబాబు వ్యక్తిగత పనులు ముగించుకొని దర్శి వైపు నుండి అద్దంకి వైపు వస్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. నాగేంద్రబాబుకు మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు వాహనంలో ఒంగోలు తరలించారు.

# గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

**ప్రజాశక్తి - వేటపాలెం**

గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కలిగి ఉండాలని శక్తి బృందం ఎస్ఐ హరిబాబు తెలిపారు. ఎస్‌పి తుషార్ డూడి ఆదేశాల మేరకు డిఎస్పి మొయిన్ సూచనలతో మండలంలోని పందిళ్ళపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలు, సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. శక్తి బృందం ఎస్ఐ హరిబాబు మాట్లాడారు. శక్తి యాప్ మహిళలకు రక్షణ కవచం వంటిదని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 79934 85111 నంబరుకు, హెల్ప్ లైన్ నెంబర్లు 110, 112,1098,181, 1930, 1972ల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులచే శక్తి లోగో ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎస్ఐ పి జనార్ధన్, ట్రైనింగ్ ఎస్ఐ జగ్జీవనరావు, ఎఎస్ఐ శివకుమారి, కె సుబ్బారావు, లోకేశ్వరరావు, ధనలక్ష్మి, సునీత, హెచ్ఎం తలమల దీప్తి పాల్గొన్నారు.

**చీరాల :** మహిళల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న శక్తి యాప్‌పై ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు మోడల్ స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. సిఐ నాగభూషణం మాట్లాడారు.

**యద్దనపూడి :** మండలంలోని అనంతరం కొల్లా వీర వసంతరావు జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు శక్తి యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం రాఘవరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఎస్ఐ రత్నకుమారి మాట్లాడారు. విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామ్మోహనరావు, యోహాను, కృష్ణారెడ్డి, శ్రీను, చల్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఉచితంగా వైద్యపరీక్షలు

**ప్రజాశక్తి - పర్చూరు**

స్థానిక వైఆర్ హై స్కూలులో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత వైద్య పరీక్షలు మంగళవారం నిర్వహించారు. మెడికల్ అసెస్మెంట్ క్యాంపు నిర్వహించినట్లు జిల్లా కో ఆర్డినేటర్ జ్యోత్స్న తెలిపారు. అలింకో డాక్టర్స్ బృందం వచ్చి ఉపకరణాల నిమిత్తం ఉచిత వైద్య పరీక్షలు చేశారు. సదరన్ సర్టిఫికెట్ ఉండి యుడి ఐడి కార్డ్స్ లేనివారికి ఐడి కార్డ్స్ అందజేస్తున్నట్లు తెలిపారు. క్యాంపుకు హాజరు కాలేని వారెవరైనా ఉంటే మాటల్లో నిర్వహించే వైద్య క్యాంపుకు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎంఇఒ ఎ శివ కోటేశ్వరరావు, పి వెంకట రామయ్య, మొలబంటి వెంకటేశ్వర్లు, డాక్టర్ ప్రియవర్మ, హెచ్ఎం రాజశేఖర్ పాల్గొన్నారు.

## సంక్షేమం అందిపుచ్చుకోవాలి

**ప్రజాశక్తి - యద్దనపూడి**

స్థానిక స్త్రీ శక్తి భవనం నందు ఎంఎంఎస్ అధ్యక్షులు బత్తుల కృష్ణవేణి అధ్యక్షతన గ్రామ సంఘాల అధ్యక్షులు సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశంలో డిఆర్డిఎ పిడి శ్రీనివాసరావు మాట్లాడారు. సంక్షేమ పథకాలు అందిపుచ్చుకోవాలని అన్నారు. ప్రతి మహిళను లక్షాదికారిని చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నట్లు తెలిపారు. బ్యాంకు లింకేజీ, ఇతర పొదుపు పథకాలు ఉపయోగించుకొని అభివృద్ధి చెందాలని అన్నారు. కార్యక్రమంలో డిపిఎం రవీంద్రబాబు, ఎపిఎం వెంకట్రావు, సీసీలు రవి బాబు, పవన్ రామ్, రవికుమార్ పాల్గొన్నారు.

## తల్లిదండ్రులకు అప్పగింత

**ప్రజాశక్తి - వేటపాలెం**

మండలంలోని పందిళ్ళపల్లి జడ్పీ హైస్కూల్ నందు 9వ తరగతి చదువుతున్న గుత్తి పరిపూర్ణ, గడ్డం మహేష్ ఇద్దరూ స్కూలుకు వెళుతున్నామని చెప్పి వెళ్ళకుండా కనపడకుండా వెళ్లిపోయారు. తల్లిదండ్రులు ఎంత వెతికినప్పటికీ దొరకకపోవడంతో పోలీసులకు పిర్యాదు చేశారు. వెంటనే స్పందించి స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల సహాయంతో స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో ఇద్దరు విద్యార్థులు తిరుగుతున్న ప్రదేశాన్ని గుర్తించి 30 నిమిషాల వ్యవధిలో ఇద్దరినీ తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్ఐ పి జనార్ధన్ తెలిపారు.

## మహిళ మెడలో గొలుసు అపహరణ

**ప్రజాశక్తి - చీరాల**

బాపట్ల ప్రాంతానికి చెందిన మేకల సుబ్బమ్మ తన సహోదరి భూలక్ష్మితో కలిసి చీరాల గొల్లపాలెంలో ఉంటున్న బంధువుల ఇంటికి వచ్చింది. తిరిగి బాపట్ల వెళ్లేందుకు కూరగాయల మార్కెట్ వెనకవైపు రోడ్డులో బ్రహ్మంగారి గుడి సమీపంలో నడుచుకుంటూ వెళుతున్న సుబ్బమ్మ మెడలోని రెండున్నర సవర్ల బంగారు గొలుసును ద్విచక్ర వాహనంపై వచ్చి గుర్తుతెలియని ఇద్దరు దుండగులు ఒక్కసారిగా అపహరించారు. ఆమె కేకలు వేయడంతో ద్విచక్ర వాహనం పరారయ్యారు. విషయం తెలుసుకున్న సీఐ స్పందించారు. సీసీ కెమెరాలు ఆధారంగా గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు.



లబ్ధిదారులకు అందజేస్తున్న నరేంద్ర వర్మ

## సిఎం సహాయనిధి పంపిణీ

**ప్రజాశక్తి - బాపట్ల**

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక అసమానతలు తగ్గించడానికే పి4 పథకం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. అనంతరం సీఎం సహాయ నిధి నుండి మంజూరైన రూ.13.52లక్షల విలువైన చెక్కుల పిట్టలవానిపాలెం మండలంలోని 22 మందికి అందజేశారు.



ధర్నా చేస్తున్న అంగనవాడీ కార్యకర్తలు

## అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన

**ప్రజాశక్తి - వేటపాలెం**

అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరసన మంగళవారం కొనసాగింది. స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఆన్లైన్ వర్క్ చేయలేమంటూ నిరసన తెలిపారు. ఫోన్‌లు వద్దంటూ సంబంధిత అధికారులకు అప్పగించారు. సిఐటియు కార్యదర్శి ఎం వసంతరావు మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లో హాజరు, లబ్దిదారులు ఆహారం సరుకులు పంపిణీ రికార్డులో వ్రాస్తామని తెలిపామని అన్నారు. ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని కోరారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రమీల, బ్యూల, పద్మ, భూలక్ష్మి, జ్యోతి, ఆదిలక్ష్మి, నిర్మల, పద్మావతి పాల్గొన్నారు.

## అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదు

**ప్రజాశక్తి - వేటపాలెం**

విఒఎలు విధుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని చీరాల ఏరియా కో ఆర్డినేటర్ డిపిఎం సనీత హెచ్చరించారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో చీరాల, వేటపాలెం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో వేటపాలెం ఎపిఎం కె అంజిబాబు, చీరాల ఎపిఎం కె మధుసుధానరావు, సీసీలు బుజ్జి, వేణు, శ్రీను, కవిత, అనురాధ, విజయలక్ష్మి, చిన్నయ్య పాల్గొన్నారు.

సహకార బ్యాంకు

# సేవల్లో పిడిసిసిబి ఫస్ట్

## అవార్డు అందుకున్న పిడిసిసిబి చైర్మన్ డాక్టర్ సీతారామయ్య


అవార్డు అందుకుంటున్న పిడిసిసిబి చైర్మన్ డాక్టర్ సీతారామయ్య

**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

సహకార బ్యాంకు సేవలలో ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రథమ స్థానంలో నిలిచింది. ఆప్కాబ్ 62వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం విజయవాడ మాకినేని బసవ పున్నయ్య కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాలలో ఉత్తమ సేవలు అందించిన పిడిసిసి బ్యాంకులకు అవార్డులు అందజేశారు. ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.3435 కోట్ల వ్యాపారం చేపట్టింది. ఇందులో డిపాజిట్లు 566 కోట్లు కాగా, రైతులకు రుణాలు రూ.2568 కోట్లు ఇచ్చింది. దీంతో పిడిసిసి బ్యాంకు రాష్ట్ర స్థాయిలో సహకార బ్యాంకు సేవలలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఉత్తమ సేవలకు పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ కె.సీతారామయ్య, సిఈఒ వై.ప్రకాష్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు అవార్డును అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఎక్స్ ఆఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్, ఆర్‌సిఎస్ కమిషనర్ ఏ.బాబు, నాబార్డు సిజిఎం ఎంఆర్ గోపాల్, ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి, ఆప్కాబ్ పర్సన్ ఇన్‌చార్జి చైర్మన్ గన్ని వీరాంజనేయులు, 13 జిల్లాల డిసిసిబి చైర్మన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ కె.సీతారామయ్య, సిఈఒ వై.ప్రకాష్ మాట్లాడుతూ జిల్లాలో సహకార బ్యాంకు సేవలను మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తామన్నారు.

# ఆరోగ్యంగా జీవించే హక్కు లేదా.?

- రొయ్యల కంపెనీల వ్యర్థాలతో నీరు, భూమి, గాలి కలుషితం
- రొయ్యల ప్రాసెసింగ్ ప్లాంట్ల వల్ల ఏర్పడుతున్న కాలుష్యం
- కాలుష్య కాసారాలుగా తీర ప్రాంత గ్రామాలు
- కాలుష్య నివారణ చర్యలను గాలికి వదిలేసిన యాజమాన్యాలు


కలెక్టర్‌కు తమ సమస్యలు వివరిస్తున్న గ్రామస్తులు

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

జిల్లాలోని తీరప్రాంతంలో విస్తరించి ఉన్న రొయ్యల ప్రాసెసింగ్ ప్లాంట్ల వల్ల తీవ్రస్థాయిలో కాలుష్యం ఏర్పడుతోంది. సదరు కంపెనీ యాజమాన్యాల నిర్లక్ష్యం కారణంగా తాగునీరు కలుషితమవుతున్నాయి. పంటభూములు బీడులుగా మారుతున్నాయి. చర్మ, శ్వాసకోశ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ధనార్జనే ధ్యేయంగా ఉన్న యాజమాన్యాలు రొయ్యల శుద్ధి ప్లాంట్స్ వల్ల కలిగే కాలుష్య నివారణకు తీసుకోవలసిన చర్యల గురించి ఏమాత్రం పట్టించుకున్నట్లు పరిస్థితి లేదు. దీంతో పలు గ్రామాల ప్రజలు న్యాయం కోరుతూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

తమ గ్రామాలకు సమీపంలో ఉన్న రొయ్యల కంపెనీల నుంచి వెలువడుతున్న విషవాయువులు, వ్యర్థ జలాల కారణంగా ఏటా మూడు పంటలు పండే భూములు పనికి రాకుండా పోతున్నాయని, దుర్గంధం, విషవాయువుల కారణంగా ఇళ్లలో ఉండే పరిస్థితి లేకుండా పోతుందని, చర్మవ్యాధులు, శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నామని జిల్లా పరిధిలోని కర్లపాలెం మండలంలోని పలు గ్రామాల ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ జె.వెంకటమురళి ముందు తమ గోడు వెళ్లబోసుకున్నారు. దమ్మున్నవారిపాలెం, బోలాయిపాలెం, దిండివారిపాలెం, ఖాజీపాలెం, పోతనకట్టవారిపాలెం గ్రామాల పరిధిలో ఉన్న రొయ్యల కంపెనీలు సతీష్ మెరైన్, అపర్ణ మెరైన్, ఛాయిస్, మెరైన్, అన్నం మెరైన్‌ల కారణంగా తాము తీవ్ర ఇక్కట్ల పాలవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రారంభంలో తమ ప్రాంతంలో ఒక్క కంపెనీ మాత్రమే ఉందని, ఇప్పుడు వరుసగా నాలుగు కంపెనీల ఏర్పాటు కారణంగా తీవ్రమైన కాలుష్యం ఏర్పడి తాము అక్కడ జీవించే పరిస్థితి లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

కాగా రొయ్యలను శుద్ధి చేసే పరిశ్రమల వల్ల గాలి, నీరు, భూమి కాలుష్య కారకాలుగా మారాయి. రొయ్యలను శుద్ధి కోసం ఎక్కువ నీరు వాడుతున్నారు. రొయ్యలను శుద్ధి చేసేటప్పుడు రొయ్యల తొక్కలు, తలలు, తోకలు వంటివి పెద్ద మొత్తంలో ఘన వ్యర్థాలుగా బయటపడతాయి. వీటిని సరైన పద్ధతిలో శుద్ధి చేయకపోవడంతో చాలా హానికరంగా మారుతున్నాయి. రొయ్యలను శుద్ధి ప్లాంట్స్‌లో నిల్వ ఉంచే వ్యర్థాల నుండి వచ్చే దుర్వాసన వలన గాలి కాలుష్యం నెలకొంటుంది. అలానే రొయ్యలను శుద్ధి చేసేటప్పుడు ఉపయోగించే క్లోరిన్, ఇతర రసాయనాలు శుద్ధి చేయకుండా బయట పంపడం వల్ల అవి నీటి కాలుష్యానికి దారితీస్తున్నాయి. జిల్లా అధికారులు, పోల్యూషన్ బోర్డు అధికారులు తగిన చర్యలు తీసుకోవలసి ఉంది.